క్లుప్తంగా

3న పునీత థామస్ చర్చి వార్షికోత్సవం



తుమ్మకోట(రెంటచింతల): గ్రామంలోని పునీత థామస్ చర్చి 125వ వార్షికోత్సవం జూలై 3న నిర్వహించనున్నట్లు విచారణ గురువులు మాలై పవిత్రన్ ఆదివారం తెలిపారు. అపోస్తులు 12 మందిలో ఒకరైన పునీత థామస్ భారతదేశంలో మొదటిసారి క్రీస్తు సువార్తను ప్రచారం చేశారని వివరించారు. ఆయన పేరుమీదుగా తుమ్మకోటలో 1900 సంవత్సరాల చర్చి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. పల్నాడు ప్రాంతంలోనే తుమ్మకోట చర్చి అతి పురాతన చర్చిగా పేర్కొన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం 10.30 పవిత్ర సమష్టి దివ్య పూజాబలిని సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ వార్షికోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పునీత థామస్‌వారి దివ్యాశీస్సులు పొందాలని ఆయన కోరారు.

రెడ్ క్రాస్ సభ్యులకు సత్కారం



నరసరావుపేట రూరల్: ఇస్సపాలెం ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఆదివారం నూతనంగా ఎన్నికైన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులను సత్కరించారు.అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల కోసం సత్రంలో అన్నదానాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్నదానాన్ని ఎంఏఎం కళాశాల చైర్మన్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులతో పాటు సామాన్యులకు సత్రంలో అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను అభినందించారు. సత్రం కమిటీ కన్వీనర్ బత్తుల మురళి మాట్లాడుతూ గత 25 వారాలుగా అన్నదానాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో తాళ్ల వెంకటకోటిరెడ్డి, గౌరు వెంకటేశ్వర్లు, తాడువాయి రామకృష్ణ, చీమకుర్తి రాజా, పరుచూరి రామకోటేశ్వరరావులను సత్కరించారు.

రంగా విగ్రహావిష్కరణ



అచ్చంపేట: స్థానిక ఆంజనేయస్వామి విగ్రహ సెంటర్‌లో ఆదివారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాజీ ఎమ్మెల్యే దివంగత వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వంగవీటి రంగా నిరుపేదల హక్కుల కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. సభకు స్థానిక కాపునాడు అధ్యక్షుడు గంధం కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, వీ హరిబాబు, అనంతరామయ్య, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరంలో వంద మందికి పరీక్షలు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాల్లో ఎం.వి. రెడ్డి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 100 మందికి పైగా రోగులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో 40 మంది శుక్లాలు, కంటి పొరలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన మందులను రోగులకు ఉచితంగా అందజేశారు. శుక్లాలు, కంటి పొరలతో బాధపడుతున్నవారికి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఓఏ సుమంత్, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

టీవీ కార్యాలయంపై దాడి హేయం

రెంటచింతల: హైదరాబాద్‌లో ఓ చానల్ కార్యాలయంపై దాడిచేయడం ప్రజాస్వామ్యానికే అవమానమని సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగనాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

వాగులు, వంకలను వదలడం లేదు..

- రెచ్చిపోతున్న కబ్జాదారులు
- వాగులు పొంగితే జలమయమవుతున్న కాలనీలు
- ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు శూన్యం

రెంటచింతల: కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. చెరువులు, వాగులు, వంకలు వదలడం లేదు. కనిపిస్తే పాగా వేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో పూర్వీకులు కొందరు మంచి మనస్సుతో గ్రామ ప్రజలు, పశువుల తాగునీటి అవసరాల కోసం చెరువులు, కుంటలు ఏర్పాటు తమ భూములను దానం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఆక్రమణలకు గురవుతున్నాయి.

వివరాలు.. గోలి గ్రామ శివార్లో ని 90 డీ సర్వే నంబరులోని సుమారు 5.12 ఎకరాల పెద్దకుంటను పూర్వీకులు రైతులకు, పశువులకు తాగునీటి కోసం దానం చేయగా ఇది కబ్జా కోరల్లో చిక్కుకుంది. పశర్లపాడులోని వెన్నావారి కుంట, తుమ్మకోట గ్రామంలోని నల్ల చెరువు, కుమ్మరి కుంట, రెంటచింతల శివార్లోని అప్పయ్య కుంట, కోనయ్య కుంట ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో వీటిపై అధికారులకు ఫిర్యాదులు చేసిన వారు అంటిముట్టనట్లు వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెంటచింతల గ్రామ సమీపంలోని ఏడుమంగళం వాగు పూర్తిస్థాయిలో కనిపించడం లేదు. దీంతో వాగు చిన్న కాలువను తలపిస్తోంది. 2016 సెప్టెంబర్ 13న భారీ వర్షం పడిన సమయంలో ఏడుమంగళం వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం లోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జెట్టిపాలెంలోని 616 వ సర్వే నంబర్లో ఉన్న మంచినీటి కోసం పూర్వీకులు ఏర్పాటుచేసిన 18.30 ఎకరాల నానమ్మ చెరువును కొందరు నివాసాలు, ప్రార్థనా మందిరాలు, చొప్పదొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. రెంటచింతల లోని 545/1లోని 34 ఎకరాల నజీరుద్దీన్ చెరువునూ కొందరు కబ్జాదారులు వదిలిపెట్టడంలేదు. దీనితో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో గ్రామాలల్లో మంచి నీటి బోర్లు వేసవిలోనే కాక ఏకాలంలో కూడా పనిచేయని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు స్పందించి చెరువులు కుంటలు ఆక్రమణదారుల నుంచి విడిపించాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.



రెంటచింతలలోని ఏడుమంగళం వాగు దుస్థితి



ఆక్రమణకు గురైన జెట్టిపాలెంలోని నానెమ్మ చెరువు

ఆక్రమణదారులపై చర్యలు చేపట్టాలి



కబ్జాకోరల్లో నుంచి కుంటలు, చెరువులను, వాగులను విడిపించి వాటిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. దీని వలన ప్రతి ఏటా వేసవిలో గ్రామాలలోని బావులు, బోర్లు ఎండిపోయి తీవ్రమైన మంచినీటి సమస్య ఏర్పడుతుంది. ఆక్రమణకు గురైన వాటిని స్వాధీనం చేసుకుని పూడికలను తీయించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కె.రంగనాయకులు, సీపీఐ మండల కార్యదర్శి, పాలువాయి

కార్మికులకు తీరని ద్రోహం చేసిన ప్రభుత్వం



మాట్లాడుతున్న షేక్ సిలార్ మసూద్

సత్తెనపల్లి: కార్మికులు పోరాడి సాధించుకున్న బ్రిటిష్ కాలం నాటి చట్టాలను సైతం కేంద్ర ప్రభుత్వం కాలరాస్తూ కార్మికులకు నష్టం కలిగించి యజమానులకు లాభాలు సమకూర్చిపెట్టే అనుకూల చట్టాలను తీసుకువచ్చి కార్మికులకు తీరని ద్రోహం చేసిందని పల్నాడు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ పేర్కొన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో ఆదివారం జరిగిన పల్నాడు జిల్లా భవననిర్మాణ కార్మిక సంఘం విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు అధ్యక్షత వహించారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టేందుకు వచ్చేనెల 9న కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. నాడు ప్రతి పక్షంలో ఉన్న టీడీపీ తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటి వరకు సంక్షేమ బోర్డు పునరుద్ధరించలేదని, పెండింగ్ బకాయిలు చెల్లించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానానికే కార్మికులు అలసిపోతూ ఉంటుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు 12 గంటల పని విధానాన్ని తీసుకురావడం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, కేంద్ర కార్మిక సంఘాలు చేపడుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులంతా పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసనను తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బత్తుల ఏడుకొండలు, కోట ఆంజనేయులు, షేక్ సైదులు, సురేష్, రామిశెట్టి ఆంజనేయులు, యేసు, అంగలకు దురు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీరాస్వామికి భారత ప్రతిభా సేవా పురస్కారం

సత్తెనపల్లి: నిస్వార్థ సేవకు, అంకితభావానికి నిదర్శనంగా నిలిచిన పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన గంజి వీరాస్వామికి ప్రతిష్టాత్మకమైన 'భారత ప్రతిభా సేవా పురస్కారం' లభించింది. గత రెండున్నర దశాబ్దాలుగా సమాజ సేవలో నిరంతరం కృషి చేస్తున్న వీరాస్వామి సేవలను గుర్తించిన ఎల్‌సీఎఫ్ ఫౌండేషన్ జాతీయ పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఏకేవీకే జూనియర్, డిగ్రీ కళాశాలలో ఆదివారం పురస్కారం అందజేసింది. ఈ సందర్భంగా గంజి వీరాస్వామి మాట్లాడుతూ పురస్కారం అందించిన ఎల్‌సీఎఫ్ ఫౌండేషన్ సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి, సమాజ శ్రేయస్సు కోసం మరింత కృషి చేస్తానని తెలిపారు. గంజి వీరాస్వామికి ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, వంగర మధు, వంగర శ్రీనివాసరావు, అవ్వారు ఏడుకొండలు, దివ్వెల శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

సామ్రాజ్యవాదానికి ఇరాన్ బలి

రొంపిచర్ల: సామ్రాజ్యవాద లక్షణాలతో, యుద్ధ దాహంతో రగిలిపోతున్న అమెరికా తాజాగా ఇరాన్‌పై బల ప్రదర్శనకు దిగి అశాంతిని నెలకొల్పిందని వామపక్ష సీనియర్ నాయకులు బి. ఆంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని అన్నవరంలో ఇరాన్‌పై అమెరికా దాడిని నిరసిస్తూ ఆదివారం ఏర్పాటు చేసిన ప్రజా సదస్సులో ఆయన మాట్లాడారు. అమెరికా అండతో పాలస్తీనాలోని గాజాను ఇజ్రాయిల్ నేలమట్టం చేసి, 60 వేల మంది అమాయక ప్రజలను బలి తీసుకుందని విమర్శించారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్ విరుచుకుపడటం వెనుక అమెరికా హస్తం ఉందని తెలిపారు. ఒక్కరోజులోనే 100 ప్రధాన లక్ష్యాలపై దాడి జరిపి ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసిందని వివరించారు. అమెరికా యుద్ధోన్మాదాన్ని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వ్యవసాయం గిట్టుబాటు కాక మద్దతు ధర కోసం రైతాంగం అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వాలలో చలనం లేదని విమర్శించారు. సదస్సులో అన్నవరం పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చిలకలూరిపేట: చిలకలూరిపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరాలు



డాక్టర్ సునీతాకుమారిని సన్మానిస్తున్న శాంతి శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు

నకరికల్లు: ఏఎం రెడ్డి విద్యాసంస్థల ఆధ్వర్యంలో మండలంలోని చేజర్ల గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎం రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏఎం రెడ్డి విద్యాసంస్థలు, కేసీ ఓవర్సీస్ కన్సల్‌టెన్సీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ వైద్యసేవలను ప్రజలకు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ప్రముఖ ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ రామిరెడ్డి వినోద్‌కుమార్, ప్రసూతి, వంధ్యత నిపుణులు డాక్టర్ రామిరెడ్డి సునీతకుమారి, పీడియాట్రీషియన్, నియోనెటాలజీ నిపుణులు డాక్టర్ ఎం.ఎస్.సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు శిబిరంలో పాల్గొని వైద్యసేవలు అందించారు. అనంతరం వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ల జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు తాడువాయి శివనాగరాజు, పోలిశెట్టి శివప్రసాద్ సహకారంతో నరసరావుపేటకు చెందిన తేజ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆసుపత్రికి చెందిన వైద్యులు బొట్ల రఘుప్రసాద్, బొట్ల రంగతేజ, కర్నాటి శ్రావణి, కంటి వైద్య నిపుణుడు దండమూడి వెంకటేశ్వరరావులు వైద్య పరీక్షలు చేశారు. శిబిరంలో 210 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో పెద్దలు మారూరి రామలింగారెడ్డి, ఎన్‌సీసీ ఉపాధ్యాయులు కే సాయిజగన్నాథం, షేక్ అబ్దుల్ మజీద్, అన్నదాసు సురేష్, సయ్యద్ అన్వర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



ఇంజనీర్ అశోక్‌ను సన్మానిస్తున్న డాక్టర్ యశస్వి రమణ తదితరులు

నాదెండ్ల: గణపవరం కుప్పగంజివాగు సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణ పనులను ధర్మకర్తలు ఆదివారం పరిశీలించారు. గతేడాది ఏప్రిల్‌లో ధనకుగరం సీతారామానుజాచార్య స్వామి భూమి పూజ నిర్వహించారు. అప్పటి నుంచి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ ఇంజినీరింగ్ పనులు నిర్వహిస్తున్న అశోక్‌ను జ్ఞాపికతో సత్కరించారు. రూ.2 కోట్లతో నిర్మిస్తున్న ఆలయానికి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ కుటుంబ సభ్యులు 20 సెంట్ల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. దాతలు సహకరించాలని, త్వరలో నిర్మాణ పనులకు కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ధర్మకర్తలు డాక్టర్ యశస్వి రమణ, ప్రసన్న యశస్వీ తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట సాయిబాబా దేవస్థానం ధర్మకర్త విజయ్‌కుమార్, గణపవరం శివాలయం ధర్మకర్త కెల్లంపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిమితులు లేని పని విధానం అమలుకు కుట్రలు

నరసరావుపేట: కార్మిక, కర్షక, అణగారిన వర్గాల ప్రజల సంక్షేమం కోసం వచ్చేనెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్ యూనియన్ (సీఐటీయు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి పిలుపునిచ్చారు. సీపీఎం కార్యాలయంలో యూనియన్ నాయకులు ఎం.రత్నకుమారి అధ్యక్షతన సార్వత్రిక సమ్మె జయప్రదం కోసం నిర్వహించిన సన్నాహక సమావేశంలో శివకుమారి మాట్లాడారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ కార్మిక చట్టాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలను పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టే కుట్రలను చైతన్యంతో తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిమితులు లేని 14 నుంచి 20 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని అవహేళన చేస్తూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్మికవర్గానికి తీరని ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. లేబర్ కోడ్లు అమలైతే కార్మికులు పోరాటాలు చేసే హక్కుకోల్పోతారని, వారాంతపు సెలవులు, పీఎఫ్, ఈఎస్‌ఐలు ఉండవని తెలిపారు. యూనియన్ల గుర్తింపు రద్దు చేస్తారని, కార్మిక వర్గానికి ఎటువంటి భరోసా ఉండదని వివరించారు. యూనియన్ నాయకులు ఎం.భూలక్ష్మి, డి.రత్నకుమారి, టి.అంకమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



నాదెండ్ల: ఇస్కాన్ టెంపుల్స్ ఆధ్వర్యంలో మండలంలోని సాతులూరులో ఆదివారం జగన్నాథ రథయాత్ర వైభవంగా నిర్వహించారు. తొలుత గ్రామంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభమైంది. ఆలయం నుంచి గ్రామ వీధుల్లో స్వామివారి నామస్మరణ చేస్తూ యాత్ర సాగింది. ప్రత్యేక రథంలో కృష్ణ భగవానుడు శోభాయమానంగా దర్శనమిచ్చాడు. రథయాత్ర ముందు నరసరావుపేటకు చెందిన మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఆరు గంటలకు ప్రారంభమైన రథయాత్ర తొమ్మిది గంటలకు ముగిసింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ ధర్మకర్త ఐనవోలు శివనాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, పసుమర్తి నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

గంగమ్మ తల్లికి ఆషాఢం బోనాలు



గంగమ్మ తల్లికి ఆషాడ మాస బోనాలు సమర్పిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలోని గంగమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం ఆషాఢ మాస బోనాలు సమర్పించే కార్యక్రమాన్ని భక్తులు విశేషంగా హాజరై నిర్వహించారు. గంగమ్మ తల్లికి ఉదయాన్నే ప్రత్యేక పూలతో ఆలయ పూజారులు అలంకరించి భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. భక్తులు విశేషంగా హాజరై గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పుణ్య దంపతులు పాల్గొని బోనాల మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

• నిరుపయోగంగా మరుగుదొడ్లు



జెట్టిపాలెం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న సామూహిక మరుగుదొడ్లు

మహిళల ఆత్మాభిమానాన్ని కాపాడటంతో పాటు బహిరంగ మలవిసర్జన నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో చేపట్టిన సామూహిక మరుగుదొడ్లు మండలంలోని పలుగ్రామాలలో నిరుపయోగంగా ఉన్నాయి. 2017-18 కు సంబంధించి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా మంజూరైన రూ.6 లక్షలతో మండలంలోని జెట్టిపాలెం, పాలువాయిగేటు, పశర్లపాడు, మంచికల్లు గ్రామాలలో సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఈ మరుగుదొడ్లను వినియోగించుకోకపోవడంతో లక్షల నిధులు బూడిదలో పోసినట్లు అయింది. అవగాహన కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. - రెంటచింతల

చిన్నారుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



శ్రీసత్యసాయి సేవా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సమితి ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల విద్య నుంచే చిన్నారులలో నైతిక విలువలను పెంపొందించడం ద్వారా ఉన్నతమైన సమాజాన్ని నిర్మించవచ్చని శ్రీసత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర విద్యా విభాగం కో-ఆర్డినేటర్లు టి.మధుసూదన్ (హిందూపూర్), ఆర్.మాధవి (గుంటూరు), కిరణ్ (కడప) తెలిపారు. శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం రామిరెడ్డిపేటలోని రాధా సుందర కల్యాణ మండపంలో శ్రీసత్యసాయి బాలవికాస్ ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. 150 మంది సత్యసాయి సేవా సంస్థల సభ్యులు గురువులుగా శిక్షణ పొందారు. ఆయా కార్యక్రమాలలో పాల్గొన్న మధుసూదన్ మాట్లాడుతూ కథలు, ఆటపాటల ద్వారా చిన్నారుల్లో విలువలు పెంపొందించేలా కృషి చేయాలని హితవు పలికారు. చిన్నారులను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని తెలిపారు. సేవాభావం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడం ద్వారా ఉత్తమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని వివరించారు. చిన్నారులలో నైతిక విలువలు పెంపొందించేందుకు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. ఈ సందర్భంగా అరండల్‌పేటలోని శ్రీ సత్యసాయి మందిరంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సంస్థల పల్నాడు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ఉమాధవ్, పట్టణ కన్వీనర్ అర్వపల్లి హరినాథ్‌బాబు, జిల్లా కో-ఆర్డినేటర్లు, భజన మండలి కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచిన క్రాంతికుమార్



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

నరసరావుపేట: ప్రజా ఉద్యమాలకు అండగా నిలబడి, చివరి వరకు విలువలు, నిబద్ధతతో ఎస్.క్రాంతికుమార్ (మెషక్) పోరాటం చేశారని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు కొనియాడారు. ఆదివారం పీడీఎం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షతన అశ్వఖుల్లాఖాన్ కాలనీలో నిర్వహించిన క్రాంతికుమార్ సంస్మరణ సభలో వక్తలుగా వైవీతో పాటు పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, పీకేయం జిల్లా కార్యదర్శి రాణి, పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి ప్రసంగించారు. చెప్పుల కార్మికుడిగా వృత్తిని మొదలుపెట్టి పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు స్థాయికి క్రాంతికుమార్ ఎదిగారని తెలిపారు. దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక సోషలిస్టు సమాజం ఏర్పడాలని నాలుగు దశాబ్దాలుగా క్రాంతి కుమార్ కలలు కన్నారని వివరించారు. ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లడంతో పాటు నూతన సమాజాన్ని సాధించడం కోసం అంతా కలిసి పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. తొలుత ప్రజా సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి హరిపోతురాజు

సత్తెనపల్లి: వచ్చేనెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని చేయూత ర్యాలీ ఆటోవర్కర్స్ యూనియన్(సీఐటీయూ) పల్నాడు జిల్లా కార్యదర్శి మొగిలి పాలెపు హరిపోతురాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని పుతంబాక భవన్‌లో ఆదివారం జరిగిన చేయూత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డివిజన్ కమిటీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

సమావేశానికి కొత్తపల్లి చిన్న మల్లయ్య అధ్యక్షత వహించారు. హరిపోతురాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగాన్ని కుదేలు చేసే విధంగా చట్టాలు మార్చాయని, దీని వల్ల ఇప్పటికే సంక్షోభంలో ఉన్న రవాణా రంగం మరింత కష్టాల్లో కూరుకుపోయే ప్రమాదాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత 106/1, 106/2ల వల్ల డ్రైవర్లకి ప్రమాదకరమైన శిక్షలు, అధిక మొత్తంలో పెనాల్టీలు వేయబడతాయన్నారు. అంతేకాకుండా ఇప్పటికే పాసింజర్ ఆటో రంగాన్ని ఓలా ఉబర్ వంటి కార్పొరేటర్ రంగాలకు అప్పగించిందని, దీంతో ఆటోలు నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్న లక్షలాది మంది జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు.